సాక్షి
వికారాబాద్
మంగళవారం । 30 । జనవరి । 2024



కుష్టుపై సమరం

కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పరీక్షలు నిర్వహిస్తోంది. 8లో▸



దొంగ ఓట్లపై ఫిర్యాదు

దొంగ ఓట్ల నమోదుపై ఎబ్బనూరు మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 8లో▸



దుమ్మూ ధూళితో..

దుమ్మూధూళితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నా మని వెంటనే రోడ్డు పనులను పూర్తి చేయాలని అగ్గనూరు ప్రజలు కోరారు. 9లో▸

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రిని కలిసిన భాస్కరయోగి



కిషన్‌రెడ్డికి పుస్తకాన్ని అందజేస్తున్న భాస్కరయోగి

పరిగి: కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని సోమవారం ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, కవి డాక్టర్ భాస్కరయోగి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన రచించిన పుస్తకాలను కేంద్ర మంత్రికి అందజేశారు. రాష్ట్రం తోపాటు వికారాబాద్ జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరినట్లు తెలిపారు.

సర్పంచుల పనితీరు భేష్

- గ్రామాల అభివృద్ధిలో వారి కృషి అమోఘం
- జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి

అనంతగిరి: గ్రామాల అభివృద్ధికి సర్పంచులు చేసిన కృషి మరువలేనిదని జెడ్పీ చైర్ పర్సన్ పట్నం సునీతారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి పనితీరు భేషుగ్గా ఉందని కొనియాడారు. జిల్లాలో చాలా మంది సర్పంచులు తమ గ్రామాల అభివృద్ధి కోసం సొంత భూములు అమ్ముకున్నారని, మరి కొందరు అప్పులు చేసి పనులు చేశారని తెలిపారు. రేపటితో సర్పంచుల పదవీకాలం ముగుస్తున్నందున వారికి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచులకు సంబంధించిన ఎంబీ రికార్డులు పూర్తి చేసి ఇవ్వాలని అధికారులకు సూచించారు. వీరి పెండింగ్ బిల్లులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బషీరాబాద్ మండలం బాద్లాపూర్ సర్పంచ్ నీలిబాయి గ్రామాన్ని అభివృద్ధి చేసి అప్పుల పాలైందని, ప్రస్తుతం అడ్డ కూలీగా వెళుతుండటం తనను ఎంతగానో బాధించిందని తెలిపారు. ఇలాంటి సర్పంచులు జిల్లాలో ఎంతో మంది ఉన్నారని తెలిపారు. కష్టపడి పనిచేసిన సర్పంచులకు పౌర సన్మానాలు చేయాలని పిలుపునిచ్చారు.

ఎన్‌వైకే జిల్లా అడ్వయిజరీ మెంబర్‌గా మహేశ్



అనంతగిరి: నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ జిల్లా అడ్వయిజరీ బోర్డు మెంబర్‌గా మర్పల్లి మండల కల్‌ఖోడ గ్రామానికి చెందని పసూల మహేశ్ నియమితులయ్యారు. కేంద్ర క్రీడలు, యువజన శాఖ తరఫున ఈ నియామకం చేపట్టారు. మహేష్ మాట్లాడుతూ.. జిల్లాలో యువతను అన్ని రంగాల్లో రాణించేలా తోడ్పాటు నందిస్తామని తెలిపారు తన నియామకానికి సహకరించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: జిల్లాలో సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సైబర్ నేరగాళ్ల వలలో పడరాదని సూచించారు. ఈ తరహా నేరాల నియంత్రణకు జిల్లాలో సైబర్ సెక్యూరిటీ వింగ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ వింగ్ ఇన్‌చార్జ్ డీఎస్పీ హనుమంత్ రావు, ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రతి పీఎస్‌లలో సైబర్ కేసుల పరిష్కారానికి సైబర్ వారియర్లను నియమించడం జరిగిందని తెలిపారు. ఈ వింగ్ సిబ్బంది సైబర్ నేరాలపై ప్రజలలో అవగాహన కల్పిస్తారని తెలిపారు.

పన్నుల వసూలులో వేగం పెంచండి

డీఎల్‌పీఓ అనిత



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ అనిత

మర్పల్లి: ఇంటి పన్నుల వసూలులో మరింత వేగం పెంచాలని వికారాబాద్ డీఎల్‌పీఓ అనిత ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల్లో ఎంత మేర పన్నులు వసూలు చేశారనే దానిపై ఆరా తీశారు. ప్రతి పంచాయతీలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య, ఎంపీఓ సుశీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోసమే కాంగ్రెస్ నైజం

- ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రజల పక్షాన పోరాటం చేస్తాం
- మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది
- ప్రభుత్వంపై ఇప్పటికే గ్రామాల్లో చర్చ జరుగుతోంది
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా ఏంటో చూపాలి
- కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్



కేటీఆర్‌కు మొక్కను బహూకరిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు

పరిగి: మోసం చేయడం కాంగ్రెస్ పార్టీ నైజమని.. ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. సోమవారం పరిగి ఎస్ గార్డెన్‌లో నియోజకర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు నిరాశ పడాల్సిన అవసరం లేదని, ప్రతిపక్ష హోదాలో ప్రజల పక్షాన పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారంటీలు కాదని 420 హామీలని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పారని, అమలు చేసేంత వరకు నిద్ర పోమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రజలే చెప్పాలన్నారు. బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు కావస్తున్న ప్రజలకు కష్టాలు తప్పడం లేదన్నారు. సాధ్యం కాని గ్యారంటీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ ఎన్నికల హామీల తోపాటు ఇవ్వని ఎన్నో పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన మహిళలు 1.57కోట్లు ఉన్నారని, వారందరికీ మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతులకు పంట పెట్టుబడి సాయం ఇచ్చేదని, నేడు ఎంత మంది రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేశారో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు బంధు పడలేదని అంటే చెప్పుతో కొట్టాలి అన్న మంత్రి మాటలకు ప్రజలకు ఓటుతో కొడతారని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ హయాంలో 1.68లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. మాపై లేనిపోని ఆరోపణలు చేసే కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ ఎందుకు విడుదల చేస్తలేదో చెప్పాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ.12వేల కోట్ల ఒప్పందాన్ని అదానితో కుదుర్చుకున్నారని, కాంగ్రెస్, బీజేపీ రెండు ఒక్కటేనని ఆరోపించారు.

వంద రోజులు కాదు..

ఆరు గ్యారంటీల అమలుకు వందరోజులు కాదని, 120రోజులు తీసుకొని కచ్చితంగా అమలు చేయాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం విప్పాలంటే అది బీఆర్‌ఎస్ ఎంపీలతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎప్పటికీ అమలు కావని, వాటిని పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది కేసీఆరే అన్నారు. వంద రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పాలన ప్రజలకు నచ్చడం లేదన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఎందుకు ఎన్నుకున్నామా అని బాధపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఆయ మండలాల ఎంపీపీలు అరవింద్‌రావు, మల్లేష్, జెడ్పీటీసీలు హరిప్రియ, నాగిరెడ్డి, మేఘమాల, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, భాస్కర్, ఆంజనేయులు, సురేందర్ పాల్గొన్నారు.

నేవీ రాడార్ సెంటర్‌తో జీవవైవిధ్యానికి దెబ్బ

పూడూరు మండలంలోని ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ సెంటర్‌తో జీవ వైవిధ్యంపై చాలా పెద్ద దెబ్బ పడుతుందని, అందుకే బీఆర్‌ఎస్ హయాంలో తాము అనుమతులు ఇవ్వలేదని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా అంటేనే ప్రకృతికి పెట్టింది పేరన్నారు. అటువంటిది 12లక్షల చెట్లను నరికి నేవీ రాడార్ సెంటర్ ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి మన్నెగూడ నుంచి హైదరాబాద్ వరకు డబుల్ రోడ్డును మంజూరు చేయిస్తే వేల చెట్లు పోతున్నాయని కోర్టులో కేసు పెట్టిన వాళ్లు ఇప్పుడు లక్షల చెట్లు పోతుంటే ఎందుకు ప్రశ్నిస్తలేరన్నారు. నేవీ రాడార్ సెంటర్ ఏర్పాటు కోసం పదేళ్ల క్రితం ప్రజాభిప్రాయ సేకరణ చేశారని, అది చెల్లదని పేర్కొన్నారు. నేవీ రాడార్ ఏర్పాటుతో జిల్లా, నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి లాభం లేదని, నష్టమే ఎక్కువని స్పష్టం చేశారు. పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పర్యావరణానికి నష్టం కలగని ఎన్నో పరిశ్రమలు ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే ప్రభుత్వంపై తాను పోరాటం చేస్తానన్నారు.

నేడు దెబ్బడగూడకు మంత్రి శ్రీధర్‌బాబు రాక

కందుకూరు: మండల పరిధిలోని దెబ్బడగూడలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి మంగళవారం ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి డి.శ్రీధర్‌బాబు హాజరుకానున్నారు. ఈ మేరకు సర్పంచ్ ఏనుగు శ్రావణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభిస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు హాజరు కావాలని కోరారు.

ఆధునిక పద్ధతితో అధిక దిగుబడులు

హయత్‌నగర్: వ్యవసాయ నిపుణుల సూచనలు తీసుకుని.. ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా పత్తి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని క్రీడా డైరెక్టర్ వి.కె సింగ్, కేవీకే హెడ్ రమణ అన్నారు. హయత్‌నగర్‌లో మెట్ట వ్యవసాయ క్షేత్రంలో సోమవారం జరిగిన అవగాహన సదస్సుకు హాజరైన వారు రైతులకు సూచనలు ఇచ్చారు. అధిక సాంద్రత పద్ధతిలో విత్తుకుని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. నీటి పారుదల, ఎరువుల యాజమాన్యంపై రైతులు శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయ్‌కుమార్, శ్రీనివాస్, సుధీర్, వాణిశ్రీ, నవీన్, శ్రీకృష్ణ, హరిక పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు తెస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: కాంగ్రెస్ కార్యకర్తపై ఈగ కూడా వాలనీయ్యనని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అంతారం తండా, చంద్రవంచ గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో గెలిపించిన తాండూరు ప్రజలకు, కార్యకర్తలకు రుణపడి ఉంటానని అన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయం అని, ఆ తర్వాత పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తుండటంతో తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తానని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో అభివృద్ధి పనులు ప్రారంభించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనితాగౌడ్, జెడ్పీటీసీ మంజుల, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, సర్పంచులు శ్రీదేవి, సావిత్రి, నాయకులు రవిగౌడ్, శ్రీను, రాంచందర్, విజయ్, అంజిలయ్య, నర్సింలు, సుదర్శన్ రెడ్డి, జగదీష్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, నరోత్తంరావు, వాసు పవార్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

పెద్దేముల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో జెడ్పీటీసీ ధారాసింగ్ ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వెనుకబడిన పెద్దేముల్ మండలంలో క్రీడాపోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి పోటీలను తాండూరు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందుతోందని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను సర్కారు బడుల్లోనే చదివించాలని సూచించారు. నియోజకవర్గంలో 10 నుంచి 12ఎకరాల్లో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్ మాట్లాడుతూ.. మండలంలో 60 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, 20 మంది పీటీలు అవసరం కాగా కేవలం ఆరుగురే ఉన్నారని తెలిపారు. , విద్యార్థుల అవసరం మేరకు గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక నిధులు, కొత్త భవనాలు మంజురు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో నెల కొన్న సమస్యలను పరిష్కస్తానని హామీ ఇచ్చారు. మొదటి రోజు క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరించిన ఆయా పాఠశాలల విద్యార్థులకు కాంగ్రెస్ నాయకులు నగదు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు రవిగౌడ్, అంజయ్య, వైస్ ఎంపీపీ మధులత, తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ లక్ష్మప్ప, మండల కోఆప్షన్ సభ్యుడు నషీర్, ఎంఈఓ వెంకటయ్య, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, మైపాల్‌రెడ్డి, ఉత్తమ్‌చందు, ప్రవీణ్ కుమార్, లోంక నర్సింలు, ఎల్లారెడ్డి, జితేందర్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకొస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల చైతన్యనగర్‌లో రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు.



అర్జీ ఇచ్చిన మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

'ప్రజావాణి'కి 205 అర్జీలు

వికారాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 205 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈవీఎంలు, ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్ తోపాటు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఈవీఎంలు ఏర్పాటు చేసి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం జంతు సంరక్షణ పక్షోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంతు హింసకు పాల్పడరాదని సూచించారు. జంతువుల సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. దేశ వ్యాప్తంగా జంతు సంరక్షణ పక్షోత్సవాలు ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కళాశాలకు స్థల పరిశీలన



దౌల్తాబాద్: కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు సోమవారం కాడా (కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి స్థల పరిశీలించారు. దౌల్తాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కన, అలాగే పాఠశాల ఆవరణలో స్థలాలను పరిశీలించారు. ఫిబ్రవరి మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అంతలోగా స్థలాన్ని చూస్తే భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయితే స్థలానికి సంబంధించిన పూర్తి నివేదికను రెండు రోజుల్లో అందజేయాలని తహసీల్దారు విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు, మాజీ వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ మంజుల, నాయకులు వీరయ్య, మల్కప్ప, మహిపాల్, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలకు స్థల పరిశీలన

కొడంగల్: ప్రభుత్వ భవనాల నిర్మాణానికి కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సోమవారం స్థల పరిశీలన చేశారు. మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ శివారులో గల ట్రైబల్ గురుకుల పాఠశాల ఆవరణలోని స్థలాన్ని పరిశీలించారు. అక్కడ విద్యా సంస్థల నిర్మాణానికి స్థలం అనుకూలంగా ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి స్థలాన్ని పరిశీలించి, సర్వేయర్‌తో మాట్లాడారు. ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల భవనాలను నిర్మించిన తర్వాత ఎంత భూమి మిగిలిందని ఆరా తీశారు. ప్రభుత్వ పరంగా విద్యా సంస్థల కోసం నూతన భవనాలను నిర్మిస్తే అనుకూలంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం కడా కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘం (తపస్ ఉపాధ్యాయ సంఘం) నాయకులు కడా ప్రత్యేకాధికారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సుంకరి వెంకటయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బాకారం మల్లయ్య, హకీం బాల్‌రాజ్, జిల్లా కార్యదర్శి బాకారం మొగులప్ప, బొంరాస్‌పేట మండల కమిటీ అధ్యక్షుడు బాకారం చంద్రశేఖర్, సంఘం నాయకులు పృథ్వీసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఖజానా ఖాళీ..!

- ఆర్థిక సంక్షోభంలో వికారాబాద్ మున్సిపాలిటీ
- ఎనిమిది నెలలుగా నిలిచిన పట్టణ ప్రగతి నిధులు
- రెండు నెలలుగా కార్మికులకు అందని వేతనాలు
- సకాలంలో వసూలు కాని ఆస్తి పన్ను



వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ మున్సిపాలిటీలో ఖజానా నిండుకుంది. రెండు మూడు నెలలుగా నిధుల కొరత ఏర్పడటంతో కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వని పరిస్థితి నెలకొంది. నెలనెలా వచ్చే ఆస్తి పన్ను, నల్లా కనెక్షన్ పన్నుల మీదనే పాలన సాగించాల్సి వస్తోంది. మున్సిపాలిటీలో కాంట్రాక్టర్లు చేసిన పనులకు కూడా డబ్బులు చెల్లించలేకపోతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు ఇస్తే గానీ ముందుకు సాగని పరిస్థితి నెలకొందని అధికారులు అంటున్నారు.

ఆగిన నిధులు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నుంచే పట్టణ ప్రగతి నిధులు మున్సిపాలిటీకి రావడం లేదు. అంతకుముందు ప్రతి నెలా కేంద్రం వాటా కింద రూ. 31లక్షలు, రాష్ట్రం వాటా కింద రూ. 31 లక్షలు అంటే ప్రతి నెలా రూ. 62 లక్షలు మున్సిపల్ ఖాతాలో జమయ్యేవి. ఈ నిధులతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులతో పాటు, సకాలంలో కార్మికుల వేతనాలు చెల్లించడంతో పాటు, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేవారు. కేంద్రం వాటా కింద ఇచ్చే రూ. 31 లక్షలను 15వ ఆర్థిక సంఘం ద్వారా ఇచ్చిన నిధులతో ముడి పెట్టడంతో నెలవారీగా వచ్చే నిధులు పూర్తిగా తగ్గిపోయాయి. ఈ నిధుల రాక ఎనిమిది నెలలుగా ఆగిపోవడంతో మున్సిపల్ ఆర్థిక పరిస్థితి దయనీయంగా తయ్యారైంది.

ఆస్తి పన్ను అంతంతే..

వికారాబాద్ మున్సిపాలిటీలో ఆస్తి పన్ను, నల్లా బిల్లుల పన్నులు కలిపి రూ. 3కోట్ల, 51లక్షల 69 వేలు రావాలి. అంటే ప్రతి నెలా సుమారుగా రూ. 29లక్షల వరకు వసూలు కావాలి. కానీ పట్టణంలో అత్యధిక మంది ఏడాదికి ఒకసారి ఆస్తి పన్ను చెల్లిస్తుండటంతో నెలవారీగా రావాల్సిన డబ్బులు రావడం లేదు. ఒక వైపు ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం, మరో వైపు సకాలంలో పన్ను వసూలు కాకపోవడంతో మున్సిపాలిటీలో నిధుల కొరత ఏర్పడింది. నెలనెలా వసూలు అవుతున్న కొంత పన్ను డబ్బులను శానిటేషన్ వాహనాల మరమ్మతులు, డీజిల్, పెట్రోల్‌కే సరిపోతున్నాయి.

రెండు నెలలుగా జీతాలు లేవు

మున్సిపాలిటీలో అన్ని విభాగాల్లో కలిపి 186 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు ఉన్నారు. ఆయా విభాగాల్లో పనిచేసే వారి అర్హత, సీనియార్టీని బట్టి రూ. 12 వేల నుంచి రూ. 16వేల వరకు వేతనం ఉంది. ఇంత తక్కువ వేతనంతో పనిచేస్తున్న కార్మికులకు, నెలనెలా వేతనం రాకపోవడంతో వారు మరింత ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు చెబుతున్నారు. 2022 లో కూడా ఆయా పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు బిల్లులు ఇవ్వలేదని విమర్శలు ఉన్నాయి. ఈ కారణంగా మున్సిపాలిటీలో కొత్త పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు కూడా ముందుకు రావడం లేదని సమాచారం.

నిధుల కొరత ఉంది



ఎనిమిది నెలలుగా పట్టణ ప్రగతి నిధులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇబ్బందులు ఉన్నా కార్మికులకు సకాలంలో వేతనాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆర్థిక సంవత్సరం చివరిలో ఉండటంతో పన్నుల రాబడి బాగానే ఉంది. దీంతో కార్మికుల వేతనాలకు ఇబ్బంది లేదు. ప్రత్యేక నిధులు ఇవ్వాలని ఇటీవలే అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కోరడం జరిగింది. ఆయన సానుకూలంగా స్పందించారు. నిధుల వస్తే అభివృద్ధి పనులు చేపడతాం.

– మంజుల, మున్సిపల్ చైర్‌పర్సన్

కుష్టు మహమ్మారిపై సమరం





వ్యాధి లక్షణాలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

- నేడు జాతీయ లెప్రసీ నివారణ దినోత్సవం
- 15రోజుల పాటు అవగాహన, ర్యాలీలు
- కుష్టు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం
- అనుమానితుల గుర్తింపు.. మందుల పంపిణీ

కొడంగల్ రూరల్ : ఎన్నో ఏళ్లుగా చికిత్సలు చేస్తున్నా.. ఎన్ని చర్యలు చేపట్టినా మహమ్మారి కుష్టు(లెప్రసీ) చాపకింద నీరులా వ్యాప్తి చెందుతుండటంతో వ్యాధిని తరమికొట్టేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టింది. వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది.

వ్యాధి వ్యాప్తి ఇలా..

కుష్టువ్యాధి అనేది లెప్రో మైక్రో బ్యాక్టీరియా, లెప్రమెటోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన వ్యక్తి శ్వాస ద్వారా బ్యాక్టీరియా ఇతరులకు చేరుతుంది. శరీరంపై తెల్లి, రాగి, గోధుమ రంగు మచ్చలు రావడం, ఆ ప్రదేశంలో స్పర్శ లేకపోవడం, చేతి గోళ్లలో, నరాల్లో తిమ్మిర్లు రావడం వంటివి వ్యాధి లక్షణాలు. వైద్యుల సలహా మేరకు మందులు వాడితే వ్యాధి తగ్గిపోయే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు.

ముందుగా గుర్తిస్తే మంచిది..

కుష్టువ్యాధి అనేది అంత ప్రమాదకరమైనది కాదని, పూర్తిగా నయంకాని జబ్బేమి కాదని, నిర్లక్ష్యం చేస్తే మాత్రం కబళించే ప్రమాదం ఉంటుంది. కావునా మల్టీడ్రగ్ థెరపీతో నయం చేసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స అందించడంతో పాటు మందులను ఉచితంగా అందజేస్తున్నారు.

80మందికి చికిత్స..

జిల్లాలో వందమంది కుష్టువ్యాధి అనుమానితులను గుర్తించినట్లు వీరిలో 80మందికి చికిత్స అందిస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. నేడు జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జిల్లాలోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అవగాహన ర్యాలీలు, వ్యాధిపై సమావేశాలు, సూచనలు అందిస్తూ వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నారు.

“ రూపుమాపడమే లక్ష్యం



కుష్టువ్యాధిని అంతం చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయిస్తూ అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో వ్యాధి నిర్మూలనకు చర్యలు చేపట్టింది. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ వ్యాధి ఉన్న వ్యక్తులకు మందులను అందిస్తూ సూచనలు, సలహాలు అందిస్తున్నారు. వ్యాధి సోకినవారు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా వైద్యుల సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా మందులు వాడడంతో వ్యాధి తగ్గుతుంది.

–డాక్టర్ రవీంద్రయాదవ్, జిల్లా టీబీ, లెప్రసీ ప్రోగ్రాం అధికారి

రైలు ఆపడం సంతోషం

మాజీ సర్పంచ్ పాండునాయక్, ఇంటర్ సిటీ సాధన సమితి చైర్మన్ వెంకటేశం

మర్పల్లి: మర్పల్లి రైల్వే స్టేషన్‌లో తిరుపతి, మరియూపూర్ణ పట్టణాలకు వెళ్లేందుకు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు మర్పల్లి రైల్వేస్టేషన్‌లో ఆపడం ఎంతో సంతోషించ దగ్గ విషయమని మర్పల్లి మాజీ సర్పంచ్ పాండునాయక్, ఇంటర్ సిటీ సాధన సమితి చైర్మన్ వెంకటేశం హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పూర్ణ జంక్షన్ నుంచి ఉ.10.25 నిముషాలకు బయలుదేరిన సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మర్పల్లిలో సాయంత్రం 5.30 గంటలకు రెండు నిమిషాలు ఆపారు. ఈ రైలు మంగళవారం ఉదయం 10 గంటలకు తిరుపతి చేరుతుందని రైల్వే మాస్టర్‌తో పాటు ఇంటర్ సిటీ సాధన సమితి చైర్మన్ వెంకటేశం, మర్పల్లి మాజీ సర్పంచ్ పాండునాయక్ తెలిపారు. తిరిగి తిరుపతి నుంచి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు బయలుదేరి మర్పల్లికి బుధవారం ఉదయం 5 గంటల 30 నిమిషాలకు వస్తుందన్నారు. తిరుపతికి, పూర్ణ పట్టణాలకు వెళ్లేందుకు మర్పల్లి రైల్వే స్టేషన్‌లో సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆపేందుకు స్టాప్ సౌకర్యం కల్పించిన దక్షిణ మధ్య రైల్వే అధికారులకు, ఎక్స్‌ప్రెస్ రైలు మర్పల్లిలో ఆపేలా కృషి చేసిన ఇంటర్ సిటీ నాయకులకు మండల ప్రజలు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇంటర్ సిటీ సాధన సమితి సభ్యులు స్టేషన్ మాస్టర్‌కు కలిసి అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జాఫర్, ఇంటర్ సిటీ సాధన సమితి సభ్యులు నర్సింలుయాదవ్, సుధాకర్ రమేష్‌మిత్ర, వెంకటేశం, తదితరులు ఉన్నారు.



స్టేషన్ మాస్టర్‌ను అభినందిస్తున్న సభ్యులు

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలోని శ్రీ లక్ష్మీఅనంతపద్మనాభ స్వామి ఆలయంలో సోమవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తాను కట్టిన ముడుపును విప్పారు. అర్చకులు ప్రత్యేక హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

క్లుప్తంగా

రేషన్ బియ్యం దారి మళ్లిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: రేషన్ బియ్యం పక్కదారి మళ్లిస్తే డీలర్లపై చర్యలు తప్పవని తహసీల్దార్ తారాసింగ్ హెచ్చరించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెల రేషన్ బియ్యం గడువులోపు లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సూచించారు. లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రేషన్ డీలర్లు లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్ఐలు రాజిరెడ్డి, బాల్‌రాజ్, ఆయా గ్రామాల డీలర్లు పాల్గొన్నారు.

మా సమస్యలను పరిష్కరించండి



ఎమ్మెల్యేను హోంగార్డుల సంఘం ప్రతినిధులు

అనంతగిరి: హోంగార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర హోంగార్డు సంఘం రాష్ట్ర ప్రతినిధులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సన్మానించారు. మా సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు అశోక్, దయానంద్, కుమారస్వామి, అశోక్‌కుమార్, హరిబాబు, చాంద్‌పాషా తదితరులు ఉన్నారు.

పన్నుల వసూలులో వేగం పెంచాలి

బంట్వారం: ఇంటి పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని డీఎల్‌పీఓ అనిత అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటి పన్నుల వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. వచ్చే నెల చివరి నాటికి పన్నుల వసూళ్లు వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పన్నులు , విధుల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలయ్య, ఎంపీఓ విజయ్‌కుమార్, ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినికి పతకం, సర్టిఫికెట్ అందజేస్తున్న చంద్రమౌళి

ధారూరు: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ధారూరు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో 8 మంది విద్యార్థులు పాల్గొని పసిడి, వెండి పతకాలతో పాటు ఓవరాల్ టీం ట్రోఫీని సాధించారని కరస్పాండెంట్ మధు తెలిపారు. సోమవారం వారిని గ్రామ సర్పంచు చంద్రమౌళి, ఉప సర్పంచు రాజేశ్వర్, గ్రామ కార్యదర్శి అంజ్యానాయక్‌లు విద్యార్థులకు పతకాలను అందజేసి అభినందించారు.

గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న నేతలు, పోలీసులు

షాద్‌నగర్: పట్టణంలోని గణపతి ఆలయంలో బీఆర్ఎస్ నేత సత్యనారాయణ అధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, పట్టణ సీఐ ప్రతాప్‌లింగం పాల్గొన్నారు. ఈ సదంర్భంగా వారు మాట్లాడుతూ... సంకటహర చతుర్థి రోజున విఘ్నేశ్వరుడి పూజ నిర్వహిస్తే విఘ్నాలు తొలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఒగ్గు కిశోర్, రాజేశ్, శ్రీధర్, ప్రభు, అభిలాష్, వెంకటేష్, చంద్రశేఖర్, అర్చకులు వికాస్, బుగ్గేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధి



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మండలంలోని అప్పారెడ్డిగూడలో నిర్మించిన సరోజినిదేవి మహిళా సమాఖ్య భవనాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ నర్సింహ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన మేడిపల్లి రవీందర్‌రెడ్డి తన తల్లి సరోజినిదేవి జ్ఞాపకార్థకంగా స్థలాన్ని దానం చేయడం గొప్ప విషయమన్నారు. మహిళ సమాఖ్య భవన నిర్మాణానికి జెడ్పీజీఎఫ్ నిధులు రూ.10 లక్షలతో భవనాన్ని నిర్మించారన్నారు. గ్రామాభివృద్ధికి కావల్సిన పనులను తెల్లకాగితంపై రాసి ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ప్రతి పనిని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి పార్టీలకతీతంగా కృషి చేయాలని సూచించారు. తన గెలుపునకు కృషి చేసిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కాట్నలత, భూదాతలు రవీందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఉప సర్పంచ్ సీతారాం, నాయకులు కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నర్సింహ, హరినాథ్‌రెడ్డి, సర్పంచులు పాండురంగారెడ్డి, ప్రభాకర్, నర్సింహ, నవాజ్ రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, బాల్‌రెడ్డి, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లపై ఫిర్యాదు



ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మకు ఫిర్యాదు చేస్తున్న మాజీ సర్పంచు రాజేందర్‌రెడ్డి

- ఆలస్యంగా గుర్తించిన గ్రామ నాయకులు
- గ్రామ కార్యదర్శి, ఆర్ఐలపై ప్రజావాణిలో ఫిర్యాదు
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఉన్నతాధికారుల ఆదేశం

ధారూరు: దొంగ ఓట్లు నమోదు చేసి గత నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓటు వేయించిన ఉదంతంపై కలెక్టర్, అదనపు కలెక్టర్లకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఎబ్బనూర్ మాజీ సర్పంచు రాజేందర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఓ వర్గానికి చెందిన 5 కుటుంబాల్లో 187 మంది ఓటర్లు ఉండటంపై అనుమానం వచ్చిందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఎల్‌ఓలకు ఇచ్చిన యాప్‌లో కొత్త ఓటర్లుగా 124 మందిని నమోదు చేశారు. ఇందులో 72 ఓట్లు సంవత్సరాల తరబడి గ్రామంలో లేని వారిని ఓటర్లుగా చేర్పి ఎన్నికల్లో ఓటు వేయించారని ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటరు జాబితాను గ్రామంలో ప్రదర్శించకుండా పంచాయతీ కార్యదర్శి రాజేశ్ జాగ్రత్త పడ్డారని చెప్పారు. ప్రస్తుత సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఐ వీరేశంలు ఇద్దరు క్లాస్‌మేట్స్ కావడం, ఆర్ఐ, గ్రామ కార్యదర్శి కలిసి దొంగ ఓట్లకు తెరలేపారని మండిపడ్డారు. గ్రామానికి చెందిన 28 మంది అసలైన ఓటర్లను తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. దొంగ ఓట్లు సృష్టించిన గ్రామ కార్యదర్శి రాజేశ్, ఊతమిచ్చిన ఆర్ఐ వీరేశంలను సస్పెండ్ చేసి ఆ ఓట్లను జాబితాలో నుంచి తొలగించాలని జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. ఫిర్యాదు స్వీకరించిన కలెక్టర్ విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ భువనేశ్వర్‌ను ఆదేశించారు.

“ విచారణ జరిపి నివేదిక పంపిస్తాం



దొంగ ఓట్ల విషయమై విచారణ జరపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇవి ఎలా నమోదయ్యాయో.. బీఎల్‌ఓ ఎలా చేశారో విచారణ జరిపి, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తాం.

– భువనేశ్వర్, తహసీల్దార్

ఈఎల్‌టీఏ ఆధ్వర్యంలో పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మొయినాబాద్: విద్యార్థుల్లో ఇంగ్లీష్‌పై ఉన్న భయం పోవాలని పెద్దమంగళారం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రఘునాథ్ అన్నారు. మండల పరిధిలోని పెద్దమంగళారం పాఠశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లిష్ భాషపై మండల స్థాయి స్పెల్ వీజర్డ్, డ్రామా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీల్లో పెద్దమంగళారం, కనకమామిడి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలువగా చందానగర్ జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, అనిత, నారాయణ, మైమూద్, రాములు, కమల తదితరులు పాల్గొన్నారు.

గూడూరు శివాలయంలో చోరీ

హుండీ పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

కొత్తూరు: మండలంలోని గూడూరు గ్రామంలో ఉన్న శివాలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. గ్రామస్తులు సోమవారం ఉదయం శివాలయంలో పూజలు చేయడానికి వెళ్లారు. అప్పటికే ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలు ధ్వంసమై ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందిచారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు హుండీలను పగలగొట్టిన విధానాన్ని పరిశీలించారు. గతేడాది నుంచి భక్తులు సమర్పించిన కానుకలు(నగదు) సుమారు రూ.లక్ష వరకు హుండీల్లో ఉన్నట్లు స్థానికులు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



దుండగులు ధ్వంసం చేసిన హుండీలు

హుక్కా సెంటర్‌పై దాడి

ఏడుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



హుక్కా పరికరాలతో పట్టుబడ్డ యువకులు

పహాడీషరీఫ్: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా కొనసాగుతున్న హుక్కా సెంటర్‌పై మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిర్వాహకులు పరారీలో ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఎర్రకుంటలో మహ్మద్ అబ్దుల్ హసన్, హబీబ్ అహ్మద్ సాగర్‌లు చిల్లు పేరుతో హుక్కా సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు సోమవారం దాడులు చేసి.. షాహిన్‌నగర్‌కు చెందిన అనాస్(25), గౌస్ సమీ(19), మహ్మద్ అజీం ఖాన్(18), సయ్యద్ జమా(25), మహబూబ్(19), ఫక్రుల్లా ఖాన్(19), అక్బర్(19)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,260ల నగదు, ఫోన్లు, హుక్కా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు



బండరావిరాలలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బలిజగూడ, బాచారం, బండరావిరాల, చిన్నరావిరాల, గువ్వలేటి గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిగులు బడ్జెట్‌తో అప్పగించిన రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందని, పదేళ్లుగా ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ నేతలకు ప్రజలు మరింత బుద్ధి చెప్పాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతోన్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పథకాలకు తోడుగా ఉచిత కరెంట్, సబ్సిడీ గ్యాస్ పథకాలను త్వరలోనే ప్రజలకు అందించనున్నామన్నారు. మిగిలిన పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ 100 రోజుల్లో అందించే విధంగా రేవంత్‌రెడ్డి సర్కారు కసరత్తు చేస్తున్నదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఏ ఒక్కరూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. అధికారులే ప్రజల వద్దకు వచ్చి సంక్షేమ పథకాలను అందించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను దశల వారీగా పూర్తి చేస్తామని, సంక్షేమ పథకాల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రేఖ, జెడ్పీటీసీ బింగి దాసుగౌడ్, వైస్‌ఎంపీపీ కౌలన్ శ్రీధర్ రెడ్డి, సర్పంచులు వీరస్వామిగౌడ్, సంతోష, శ్రీనివాస్‌రెడ్డి, వనజ, ఉపసర్పంచులు సురేష్, ప్రభాకర్‌ముదిరాజ్, ఎంపీటీసీలు వెంకటేశ్, అనిత, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్‌పాషా, నాయకులు జైపాల్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్ దత్, ఎంపీడీఓ మమతాబాయి, ఎంపీఓ వినోద నాయకులు, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు నీరందిస్తాం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- అన్మాస్‌పల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభం

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగు నీరు అందించి, నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అన్మాస్‌పల్లిలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రామ సచివాలయాన్ని సర్పంచ్ శంకర్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందించడమే లక్ష్యం అన్నారు. గ్రామాలు, తండాలలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానన్నారు. సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మిస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. విద్యా, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలు చేస్తామన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ అభ్యర్థన మేరకు అన్మాస్‌పల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, ఉప సర్పంచ్ అనిల్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సింహ, బీక్యానాయక్, భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, బీచ్యానాయక్, యాదగిరిరెడ్డి, జగన్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, బిక్కు, శేఖర్‌గౌడ్, వెంకటేశ్, చందోజీ, జహంగీర్‌అలీ, రామకృష్ణ, రాజుగౌడ్, కేశవులు, కృష్ణ, శ్రీరాములుగౌడ్, కుమార్ కార్యదర్శి హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు

షాద్‌నగర్ రూరల్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు కోరారు. సోమవారం ఉపాధ్యాయుల జీపీఎఫ్ ఖాతాలను సరిచేయాలని కోరుతూ మహబూబ్‌నగర్ జెడ్పీ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 317 జీఓ ప్రకారం ఉపాధ్యాయులను నూతన జిల్లాలకు కేటాయించారన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లాకు బదిలీ పైన వెళ్లిన ఉపాధ్యాయుల జెడ్పీ జీపీఎఫ్ ఖాతాల్లో అనేక పొరపాట్లు చోటుచేసుకున్నాయని, వాటిని సరిచేయాలన్నారు. దాదాపు 1,160 మంది ఉపాధ్యాయుల ఖాతాల్లో జమలు, ఉపసంహరణలు సక్రమంగా లేవన్నారు. ఎక్కువ ఖాతాల్లో డబ్బులు లేనట్టుగా చూయిస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల ఖాతాలు బదిలీ కాకుండా ఉంటే వెంటనే వాటిని బదిలీ చేయాలని కోరారు.



వినతిపత్రం అందిస్తున్న నర్సింలు